అలంకారప్రాయంగా రైతువేదికలు

- నీరుగారుతున్న ప్రభుత్వలక్ష్యం
- అలంపూర్ నియోజకవర్గంలో 97 రైతు వేదికలు
- రెతుల సమావేశాల్లేక.. ప్రైవేటు సమావేశాలకు అవకాశం
- పట్టించుకోని అధికారులు


ఉండవెల్లిలో సమావేశం ఏర్పాటు చేసిన డీఏఓ(ఫైల్)


పూర్తయిన కలుగోట్ల రైతువేదిక(ఫైల్)

ఉండవెల్లి: రైతులదరిని ఒక దగ్గరికి చేర్చి వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిర్మించిన రైతువేదికలు నిరుపయోగంగా ఉన్నాయి. రైతువేదికలు కొన్ని చోట్ల అలంకార ప్రాయంగా మారా యి. లక్షల వ్యయంతో నిర్మించి లక్ష్యాలను ఛేదించడంలో మాత్రం విఫలమవుతున్నాయి. వీటిని ని ర్మాణం శరవేగంగా పూర్తి చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అలంపూర్ డివిజన్‌లో 55 క్లస్టర్లు..

అలంపూర్ డివిజన్‌లో 7 మండలాల్లో దాదాపు 55 క్లస్టర్లు ఉండగా, 53 రైతు వేదికలు నిర్మించారు. ఒక్కో రైతు వేదిక నిర్మాణానికి రూ.22 లక్షల వ్యయం అయ్యింది. చివరి దశలో ఉన్న రైతు వేదికలను పూర్తి చేయించి డబ్బులను కాంట్రాక్టర్లకు జమ చేశారు. నిర్మించిన కొద్ది రోజులకే గోడలు నెర్రలు రావడం, రేకులు గాలివానకు ఎగిరిపోవడంతో వాటిని మరమ్మతు చేయించారు. కాని రైతులకు ఎలాంటి అవగాహన కల్పించకపోవడంతో ఆవేదనకు గురవుతున్నారు. వ్యవసాయ అధికారులు ప్రతిసారి పంటల విషయంలో ఎలాంటి పంటలు సాగు చేయాలి, ఏది వేస్తే నష్టపోతామని తెలపాల్సిన వారు ఆన్‌లైన్‌లో పంటల నమోదు ప్రక్రియను పరిశీలించకుండా వాటిని నమోదు చేస్తున్నారు. ఇదేం వ్యవహారమని అడిగినా పట్టింపులేదు.

ఏఈఓలు ఎక్కడ..

రైతు వేదికలు కట్టించింది ఏఈఓలకేనని తెలిసినా అమావాస్య, పున్నమికి వస్తుంటారని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పంటల నమోదు ప్రక్రియను నేరుగా చూడాలి. మండల అధికారులను స్పెషలాఫిసర్లుగా నియమించడంతో ఏఈఓలు వస్తున్నారో, లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పప్పుశనగ పంటకు వర్షం కురవకపోవడంతో రైతులు నష్టాలు చవిచూశారు. లక్షలో ఎరువులు వేసి వేచిచూసినా అధికారులు మాత్రం పట్టింపు లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదు. ప్రతి మంగళవారం, శుక్రవారం ఏఈఓలు రైతువేదికలలో రైతులతో సమావేశాలు నిర్వహించాలి. కాని ఎక్కడ జరగడం లేదు. రైతులే రావడం లేదని పక్కన పెట్టేస్తున్నారు. రైతుల పరిస్థితులను పట్టించుకోవాలని రైతులు ఆవేదనకు గురవుతున్నారు.

రైతువేదికలలో సమావేశాలు నిర్వహించాలి



ప్రతి క్లస్టర్‌లో రైతువేదికలున్నాయి. రైతువేదికల్లో ఎలాంటి ప్రైవేటు పనులకు సమావేశాలను నిర్వహించరాదు. ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితమవ్వాలి. కొన్నిచోట్ల రైతుల కోసం కొన్ని కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం. రైతులకు ప్రతి మంగళ, శుక్ర వారాల్లో సమావేశాలు నిర్వహించాలి.

– సక్రీయ నాయక్, అలంపూర్ ఏడీఏ

గురుకుల ఉద్యోగుల నిరసన


ఇటిక్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న గురుకుల ఉద్యోగులు

ఎర్రవల్లిచౌరస్తా: 2018, 2019వ సంవత్సరాల్లో సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులుగా నియమితులైన వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఇటిక్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేసి పాఠశాల ప్రిన్సిపల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గురుకుల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ 2018, 2019లో బీసీ వెల్ఫేర్‌లో నియమితులైన వారు ఇప్పటికే రెండు సార్లు ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు పొందారన్నారు. వారితో పాటుగా నియమితులైన తమకు ఇప్పటి వరకు ఒక్కసారి కూడా అవకాశం రాలేదన్నారు. ఈ విషయంలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని దీనిని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. గురుకుల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే గురుకుల ఉద్యోగుల రాష్ట్ర స్థాయి నిరసన కార్యక్రమానికి గురుకుల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు భాస్కర్‌గౌడ్, సతీష్‌కుమార్, సురేష్, రమేష్, కతలప్ప, వీరబ్రహ్మం, ఉపేందర్ ఉన్నారు.

రాజ్యాధికారం దిశగా బీఆర్ఎస్‌తో పొత్తులు


మాట్లాడుతున్న ఎంసీ కేశవరావు

అలంపూర్: రాజ్యాధికారం సాధించే దిశగానే బీఆర్ఎస్‌తో పొత్తులు పెట్టుకున్నట్టు బీఎస్పీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎంసీ కేశవరావు అన్నారు. అలంపూర్ చౌరస్తాలో పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని సెక్యులర్ భావజాలం కలిగిన బీఆర్ఎస్‌తో బీఎస్పీ పొత్తు పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రతిపక్షంగా ఉన్న పార్టీలు బలపడితేనే అధికార పార్టీని ఎదుర్కోవడానికి ప్రజల పక్షాన ప్రశ్నించడానికి అవకాశం ఉంటుందన్నారు. కొంతమంది రాజకీయ అవగాహన లేని వారు దీనిని వ్యతిరేకిస్తున్నారన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఏ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రజల సంక్షేమం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కు మారిని గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో విజయకుమార్, బీఎస్పీ నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అలంపూర్: ఈ నెల 7వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అలంపూర్ సబ్ డివిజన్ ఏడీఈ మహ్మద్ చిన్న మక్బుల్ ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ శాంతినగర్ ఫీడర్–2లో విద్యుత్ లైన్‌లకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు ఇటిక్యాల మండలంలోని 33/11కేవీ చాగాపూర్ ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. దీంతో చాగాపురం, వల్లూరు, బట్లదిన్నె గ్రామాలు, అలంపూర్ సబ్ డివిజన్‌లోని శాంతినగర్, మానవపాడు సెక్షన్ల పరిధిలోని 33/11కేవీ సబ్ స్టేషన్ లైన్‌లోని శాంతినగర్, రాజోళి, మానవపాడు, కలుకుంట్ల(శ్రీనగర్) విద్యుత్ సబ్ స్టేషన్‌లలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పశువులకు టీకాలు వేయించండి



అయిజ: పశువుల్లో థైలెరియోసిస్ వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలను తప్పకుండా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పర్దీపురంలో 141 పశువులకు వెటర్నరీ సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. పశువులకు వ్యాక్సిన్ వేయించాలనుకునేవారు పశువైద్యశాలలో సిబ్బందిని సంప్రదించి, వివరాలు తెలియజేయాలని సూచించారు.

వైరస్ వల్ల కలిగే రోగాలు అరికట్టవచ్చు

శాంతినగర్: పశువులకు ముందస్తుగా టీకాలు వేయిస్తే వైరస్ వ్యాధుల వల్ల వచ్చే రోగాలను అరికట్టవచ్చని పశువైద్యాధికారిని డాక్టర్ పుష్పలత అన్నారు. వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామంలోని పశువులకు బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా వేయిస్తున్న టీకాలు పశువులకు తప్పనిసరిగా వేయించి లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అయిజ: మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ సామిల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా కత్తి లింగన్న, రాష్ట్ర అధికార ప్రతినిధిగా మెట్టుపల్లి కొమురయ్య, వర్కింగ్ ప్రసిడెంట్లుగా కుచనపల్లి రవి, మేడికొండ సామిల్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బోట్ల రమేష్, ఎన్నికైనట్లు తెలిపారు.

ప్రధాని ప్రసంగం వీక్షించిన మహిళలు



అయిజ: కోల్‌కత్తలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన వర్చువల్ ప్రసంగాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో వీక్షించారు. ప్రధాని మోదీ డ్వాక్రా మహిళలు, ఎస్‌జీఓ సంఘాలను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని అలంపూర్ నియోజకవర్గంలోని బీజేపీ మహిళా సంఘాల నాయకురాళ్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రాజోళి: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని యాజమానులపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనువాసులు తెలిపారు. మండలంలోని మాన్‌దొడ్డిలో గల తుంగభద్ర నదిలో మంగళవారం రాత్రి ఇసుక తరలిస్తున్నారనే సమాచారం రావడంతో అక్కడికి వెళ్లగా కొందరు పరారయ్యారు. ఇసుక నింపుతున్న రెండు ట్రాక్టర్లు పట్టుబడగా, వాటిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజా దీవెన సభకు కాంగ్రెస్ శ్రేణులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు బుధవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పాలమూరు ప్రజా దీవెన బహిరంగ సభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వెంకటేష్ యాదవ్, రుక్మాందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు తరలి వెళ్లారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, అర్చకులు ఆంజనేయ శర్మ పాల్గొన్నారు.

'బీజేపీ మళ్లీ గెలిస్తే అధోగతే..'


మాట్లాడుతున్న ఎంవీ రమణ

గద్వాల అర్బన్: గడిచినా పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ పాలనలో యువకులు, రైతాంగ పరిస్థితులు దయనీయంగా మారాయని, వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే దేశం అధోగతి పాలవుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎంవీ రమణ విమర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా మత రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. భారత్ రైస్ పేరుతో ధరలను తగ్గించి ఇస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర పౌరసరఫరా శాఖతో సంబంధం లేకుండా చేసి వాళ్లు ఎక్కడ క్రయ, విక్రయాలు జరుపుతున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరుగ్యారంటీలను అమలు చేసేలా ఒత్తిడి తెచ్చి ప్రజలకు అందేలా చేస్తామని, రేషన్ కార్డు లేకున్నా ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించి, ఇండియా కూటమికి మద్దతు తెలిపాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సభ్యులు మద్దిలేటి, వీవీ నర్సింహ, పరంజ్యోతి, ఉప్పేరు నర్సింహ, నర్మద తదితరులు ఉన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ



గట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి మొత్తం 357 మంది విద్యార్థులకు గాను, 351 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, డిపార్టుమెంటల్ అధికారి కృష్ణవర్ధన్ తెలిపారు. పరీక్ష కేంద్రం బయట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గణితశాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్


డాక్టరేట్ పొందిన సత్యన్నను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర సహాయ అధ్యాపకుడిగా పని చేస్తున్న సత్యన్న ప్రఖ్యాతిగాంచి న డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గణిత సిద్ధాంతాలపై పరిశోధన చేశారు. దీంతో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి అధ్యాపకుడు సత్యన్న డాక్టరేట్ పొందారు. ఈ నేపథ్యంలో బుధవా రం జిల్లా కేంద్రంలోని కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా, అధ్యాపక బృందం శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయు డు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ లవీన మంజుల త, కళాశాల ఏఓ మక్బూల్ అహ్మద్, అధ్యాపకులు మనోజ్‌కుమార్ ఉన్నారు.

బాలగోపాల్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలి


బాలగోపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కార్మికులు

గద్వాల అర్బన్: కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన బాలగోపాల్‌రెడ్డిని ప్రతి కార్మికుడు స్ఫూర్తిగా తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. బాలగోపాల్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలో నల్లకుంటలోని కార్మికుల షెడ్డు వద్ద బాలగోపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంజనేయు లు మాట్లాడారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి బాలగోపాల్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకుడు మునీ, లారీ, హమాలీ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, నారాయణ, వెంకట్రాములు, ఏఐటీయూసీ బీచుపల్లి, నర్సింహులు, ప్రకాష్ ఉన్నారు.

ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించిన పవిత్ర



అలంపూర్: అలంపూర్ మండలం క్యాతూరుకు చెందిన రవీందర్ రెడ్డి, అరుణ దంపతుల పెద్ద కూతురు పవిత్ర గురుకులాల పరీక్ష ఫలితాల్లో ఒకేసారి మూడు ఉద్యోగాలు జూనియర్ లెక్చరర్, పోస్ట్ గ్రా డ్యుయేట్ టీచర్, ట్రెయినింగ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులను సాధించారని తెలిపారు. మూడు ఉద్యోగాలు సాధించడంతో గ్రామ ప్రజలు ప్రశంసలతో అభినందించారు.

పంచాయతీ కార్యదర్శులకు సన్మానం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లోని ఆయా గ్రామ పంచాయతీల్లో బుధవారం పంచాయతీ కార్యదర్శులను వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయా జీపీలలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులు బదిలీపై ఇతర జీపీలకు వెళ్తుండటంతో వారికి జీపీల్లో వీడ్కోలు సమావేశం నిర్వహించి పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

నిఘా నీడలో పాలమూరు

- 1,300 మందితో సీఎం పర్యటనకు బందోబస్తు
- పోలీస్ సిబ్బందికి విధులపై సూచనలు చేసిన డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్


మాట్లాడుతున్న డీఐజీ చౌహాన్

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ మైదానంలో నిర్వహించిన సీఎం సభకు బందోబస్తును జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ పర్యవేక్షించారు. ముందుగా వేదిక, గ్యాలరీలు, సభా స్థల ప్రాంగణం పరిశీలించారు. మొత్తం ఇద్దరు అదనపు ఎస్పీలు, 12మంది డీఎస్పీలు, సీఐలు 33, ఎస్‌ఐలు 60, ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్స్ 168, కానిస్టేబుల్స్ 593, మహిళ కానిస్టేబుల్స్ 149, హోంగార్డులు 124, ఆరు స్పెషల్‌పార్టీ టీంలు, 100మంది బీడీ టీం బలగాలు విధులు నిర్వహించారు. బందోబస్తుపై డీఐజీ, ఎస్పీ హర్షవర్ధన్‌లు ఫంక్షన్‌హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి సిబ్బందికి సూచనలు చేశారు. డీఐజీ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, ట్రాఫిక్‌ను మళ్లించాలన్నారు. విధుల్లో ఉన్న పోలీసులు సంయమనం పాటించాలని, సభ స్థలంతో పాటు రోడ్లపై ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సమావేశంలో శిక్షణ ఐపీఎస్ అధికారి చిత్తరంజన్, అదనపు ఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో జిల్లా కేంద్రంలోని స్టేడియంలో దిగారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో ఎంవీఎస్ మైదానానికి చేరుకున్నారు. ఈ క్రమంలో స్టేడియం దగ్గర నుంచి ఎంవీఎస్ వరకు రోడ్డుకు ఇరువైపులా పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆ తర్వాత వెళ్లే సమయంలో క్రిస్టియన్‌పల్లి నుంచి బైపాస్ రోడ్ మొత్తం పోలీస్ బలగాలు పహారా కాశారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


ధరూరులో ఉపాధ్యాయులైన విద్యార్థులు


గంగన్‌పల్లిలో..


ధరూరు: నిత్య జీవితంలో ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హెచ్ఎం రేవతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కేటీదొడ్డి: మండలంలోని గంగన్‌పల్లి పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమామహేశ్వరి, ప్రకాష్, వసీమ్, తదితరులు ఉన్నారు.

గట్టు: మండలంలోని రాయాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ అశ్విని, ఉపాధ్యాయులు వీరేష్, రాజుసాగర్, శ్రీనివాసులు, బుడ్డప్ప, రమేష్ పాల్గొన్నారు.

బిజ్వారంలో..

మల్దకల్: మండలంలోని బిజ్వారం ప్రాథమిక పాఠశాల, శ్రీహర్షిత ట్యాలెంట్ స్కూలు విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణమ్మ, రాజశేఖర్, శ్వేతరాణి, ఉపాధ్యాయులు ప్రమీల, ప్రభావతి, ప్రదీప్, శ్రీలత పాల్గొన్నారు.


రాయాపురంలో..


బిజ్వారంలో..

ఆలయ అర్చకుడి ఇంట్లో చోరీ

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ ఆలయంలో అర్చకుడిగా పని చేస్తున్న దేవళ్ల కృష్ణమూర్తి ఇంట్లో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. బాధితుడి వివరాల ప్రకారం.. కృష్ణమూర్తి శర్మ బుధవారం తెల్లవారుజామున లేచి చూడగా వంటింటి కిటికీ తెరిచి ఉంది. తలుపులు బయట గడియ పెట్టి ఉండటంతో పక్కింటి వాళ్లకు ఫోన్ చేసి గడియ తెరిపించారు. పూజా గదిలో మూడు ఇంచుల వెంకటేశ్వర స్వామి విగ్రహానికి అలంకరించి బంగారు బ్రాస్‌లెట్ కనిపించలేదు. సోఫాసెట్‌పై పెట్టిన హ్యాండ్ బ్యాగ్‌లోని రూ.15 వేల నగదు కనిపించలేదు. మరో బెడ్‌రూం బీరువాలో వస్తువులు చిందరవందరగా పడున్నాయి. వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాగా తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉంటారని అనుమానించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలను పిలిపించారు. టవర్ డంప్ తెప్పించి చోరీకి పాల్పడ్డ వారి వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. వరుస దొంగతనాలు జరుగుతుండటంపై పోలీస్ లు సీరియస్‌గా తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.27 వేల నగదు..

గద్వాల క్రైం: తాళం వేసిన ఇంట్లోకి గుర్తు తెలి యని దుండగులు చొరబడి రూ. 27 వేల నగదును చోరీ చేసిన ఘటన గద్వాల పట్టణ శివారులో చోటు చేసుకుంది. బాధితుడు కథనం మేరకు.. పిల్లిగుండ్ల కాలనీలో నివాసం ఉంటున్న జయరాంలు బుధవారం పని నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఇంట్లో రూ.27 వేల నగదు అపహరించినట్లు తెలిపాడు. చోరీ ఘటనపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

బాల్యవివాహాలు చేయడం చట్టరిత్యా నేరం


మాట్లాడుతున్న రూన్సీబాయి

పాన్‌గల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి రూన్సీబాయి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్ల లోపు వయస్సు గల బాలికలకు చదువు మాన్పించి బాల్య వివాహం చేసినా, బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయన్నారు. చిన్న వయస్సులో వివాహాల చేయడం వల్ల జరిగే నష్టాలు, విద్య ప్రాముఖ్యత, మంచి స్పర్శ, చెడు స్పర్శ, బాలల కోసం ఏర్పాటు చేసిన అత్యవసర చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్లు 1098, 112, 100 పై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాంబాబు, సోషల్ వర్కర్ నరేందర్, కేజీబీవీ ఎస్ఓ హేమలత, బాలికలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆధ్వర్యంలో మహిళలకు సన్మానం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–3 సెంటరులో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచరు మంజులరాణి సెంటర్ పరిధిలోని మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామస్తులు అంగన్‌వాడీ టీచరును సన్మానించారు. మండలంలోని తాటిపాముల గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ -2లో మహిళ దినోత్సవం సందర్భంగా టీచరు రాజేశ్వరి ఆధ్వర్యంలో సెంటర్ పరిధిలోని మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాంతబాయి, కవిత, కైసర్‌బేగం, రాధ, ఆయాలు లచ్చమ్మ, అంజనమ్మ పాల్గొన్నారు.

ముగింపు సభ వాల్‌పోస్టర్ విడుదల


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

అయిజ: హైదరాబాద్‌లో ఈనెల 9, 10వ తేదీల్లో నిర్వహించనున్న పౌరహక్కుల సంఘం ముగింపు సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పౌరహక్కుల సంఘం నాయకులు బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు విడుదల చేశారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, సుభాన్, మహేష్‌లు మాట్లాడారు. మండలంలోని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు పౌరహక్కుల సంఘం 50 వసంతాల ముగింపు కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, నాగరాజు, రాజు, సత్యన్న, శంకరన్న తదితరులు పాల్గొలన్నారు.